# యెరూషలేములో వేచియుండుట (1:12-26)

సంఘ స్థాపనకు ముందు కావలసిన సిద్ధపాటునుగూర్చి కార్యగ్రంథం1 తెలియజేస్తున్నట్టు గత పాఠంలో నొక్కిచెప్పాం. ఈ సిద్ధపాటులో రెండు ముఖ్య విషయాలను గుర్తించాం: ఆత్మను గూర్చిన వాగ్దానం, క్రీస్తుయొక్క రాకడ. ఈ పాఠంలో, శిష్యులను సిద్ధపరచడానికి అవసరమైన తక్కిన వాటిని చూద్దాం. అపొస్తలులు యెరూషలేములో వేచియుండగా ఈ సిద్ధపాటు జరిగింది.

“యెరూషలేము మొదలుకొని సమస్త జనములలో ఆయన పేరట మారుమనస్సును, పాపక్షమాపణయు ప్రకటింపబడుననియు,” పైనుండి శక్తి పొందువరకు వారు పట్టణములో (అంటే, యెరూషలేములో) నిలిచియుండుడనియు “యేసు తన అపొస్తలులకు ఆదేశించారు” (లూకా 24:47, 49). అంతేగాకుండ, యెరూషలేములో తొలిగా వారాయనకు సాక్షులైయుంటారని కూడా ఆయన తెలిపారు (1:8). క్రీస్తుయొక్క యిష్టాన్నిగూర్చిన ప్రశ్నేలేదు. ఆయన తన అపొస్తలులను యెరూషలే ములో ఉండమన్నారు.

యెరూషలేము అపొస్తలులు వ్యక్తిగతంగా ఉండగోరే చివరిస్థలమై యుండవచ్చు. ప్రభువైనయేసు సిలువ వేయబడింది - యెరూషలేములోనే. వారి శత్రువులున్నది అక్కడే. యెరూషలేముతో అపొస్తలులకు బంధాలులేవు; వారిగృహాలు, కుటుంబాలు గలిలయలో ఉన్నాయి. అయినా, వారు యెరూషలేములో వేచియుండాలని ప్రభువు ఆదేశించారు. గనుక అపొ. 1:12లో యిలా వ్రాయబడింది: “అప్పుడు వారు ఒలీవల వనమనబడిన కొండనుండి యెరూష లేమునకు తిరిగివెళ్లిరి. అ కొండ యెరూషలేమునకు విశ్రాంతి దినమున నడువదగినంత సమీపమున ఉన్నది.”[1]

యేసు తమకు ఆజ్ఞాపించినట్టు, అపొస్తలులు యెరూషలేమునకు తిరిగివచ్చినప్పుడు, వారు ప్రభువుమీద “ఆధారపడడాన్ని ప్రకటించారు.”[2] ఏమి జరిగినా అపొస్తలులు ప్రభువుమీద పూర్ణంగా ఆధారపడడానికిని, విధేయులవ్వడానికిని తీర్మానించుకొన్నారు, వారి స్వాతంత్ర్యాన్ని ఆయన స్వాధీనం చేయబూనారు! స్వతంత్రులుగా ఉండగోరి తమ యిష్టాన్ని నెరవేర్చుకొనడాన్ని వదులుకున్నారు.

> వారు (యెరూషలేము) పట్టణములో ప్రవేశించి, తాము బసచేయుచుండిన మేడగదిలోనికి ఎక్కిపోయిరి. వారెవరనగా, పేతురు, యోహాను, యాకోబు, ఆంద్రెయ,

ఫిలిప్పు, తోమా, బర్తొలొమయి (నతనియేలు), మత్తయి, అల్ఫయి కుమారుడైన యాకోబు(చిన్న యాకోబు), జెలోతే[3] అనబడిన సీమోను. యాకోబు కుమారుడగు యూదా (తద్దయి) (13 వ.).

అపొస్తలుల పేర్లపట్టీ క్రొత్తనిబంధనలో యిది నాల్గవది.[4] వాటికిని, దీనికిని ఉన్న ప్రధానమైన వ్యత్యాసమేమంటే - యిందులో పదకొండు మంది మాత్రమే చేర్చబడినట్టు కన్పిస్తారు ద్రోహియైన యూదా పేరు యిందులో లేదు.

అపొస్తలులు మేడగదిలో[5] "కూడియున్నట్టు" 13వ వచనం సూచిస్తుంది (ఒక వేళ ఇది ప్రభువుతో[6] వారు రాత్రిభోజనంచేసిన మేడగదియైయుండవచ్చు). అయితే ప్రభువు సిలువ వేయబడిన దినాన జరిగినట్టు, వారు భయపడి చీకటి గదిలో యిప్పుడు లేరు (యోహాను 20:19). లూకా తన సువార్త రచనను ఈ మాటలతో ముగిస్తు న్నాడు: "వారు ... మహా ఆనందముతో యెరూషలేమునకు తిరిగివెళ్లి యెడతెగక దేవాలయములో ఉండి దేవునికి స్తోత్రము చేయుచుండిరి" (లూకా 24:52-53). అపొస్తలులు తమ కాలాన్ని దేవాలయంలో గడిపారు - దేవాలయంలో వారు దాగి యుండడానికి[7] ప్రయత్నించలేదు! వారు తమ స్వరాలను దేవునివైపు ఎత్తారు!

అపొస్తలుల్లో ఎంతటి మార్పుకలుగుతుంది! తమయందు కలుగుతున్న ఈ మార్పుకు కారణం - పునరుత్థానుడైన ప్రభువునందలి తమ విశ్వాసమే!

## బాంధవ్యం బలపరచబడింది (1:12-14)

అపొస్తలులు దేవాలయంలోను, మేడగదిలోను కాలం గడపడంలో సిద్ధపాటులో అతి కష్టమైన భాగాన్ని సహిస్తున్నారు: అది వేచియుండటమే! మనలో ఎక్కువమందిమి వేచియుండడానికి యిష్టపడం. సిద్ధపాటుకు సమయం పడుతుంది, అయితే అది తీసికొనే కాలం విషయంలో మనం ఉత్సాహంగా ఉండం. వారు వేచియుండవలసిన కాలమెంతో అపొస్తలులకు తెలియదు "కొద్ది దినాల్లో" పరిశుద్ధాత్మ వస్తాడని యేసు వారితో చెప్పారు (1:5). అయితే అది వారాలో, నెలలో, సంవత్సరాలో[8] కావచ్చు. వారు వేచియుండడం ప్రభువు చిత్తమైతే, వారు వేచియుండడానికి సిద్ధపడ్డారు. మన మందరం ఈ పాఠం నేర్చుకోవాలి. "యెహోవాకొరకు కనిపెట్టుకొని యుండుము ధైర్యము తెచ్చుకొని నీ హృదయమును నిబ్బరముగా నుంచుకొనుము. యెహోవా కొరకు కనిపెట్టుకొని యుండుము" (కీర్తనలు 27:14).

ఇతరులతో కలిసి వేచియుండడం సహాయకరంగా ఉంటుంది. అపొస్తలులతో కలిసి వేచియున్న వారినిగూర్చి 14వ వచనం తెలియజేస్తుంది. "వీరందరును, వీరితోకూడా కొందరు స్త్రీలును, యేసు తల్లియైన మరియయు ఆయన

సహోదరులును ఏకమనస్సుతో ఎడతెగక ప్రార్థన చేయుచుండిరి''. ఆ తరువాత వచనంలో, ఒక మీటింగు సమయంలో 120 మంది[9] ఉన్నట్టు తెలుపుతుంది. ఈ గుంపు ఎంత ఆసక్తికరమైన జనమైయుండాలి! ఈ గుంపులో - మరియ, వార్తలతోపాటు[10] అపొస్తలుల భార్యలుకూడా[11] ఉండియుండవచ్చు. ప్రభువునకును, ఆయన అపొస్తలులకు పరిచర్యచేసిన స్త్రీలు,[12] సిలువ దగ్గరకు వచ్చినస్త్రీలు,[13] యేసు దేహానికి సుగంధ ద్రవ్యాలు పూయవెళ్లిన స్త్రీలు,[14] అందులో ప్రత్యేకించి యేసు తల్లియైన మరియ కూడా ఉన్నట్టు సూచింపబడింది. (లేఖనాల్లో ఆమెనుగూర్చి తెలుపబడింది యిదే కడసారి).[15]

తరువాత, యేసు సహోదరులున్నట్టుకూడా చెప్పబడింది. ఆయన జీవిత దినాల్లో, ఆయన సహోదరులు ఆయనయందు విశ్వాస ముంచలేదు (యోహాను 7:5). యేసు మృతులలో నుండి లేపబడిన తరువాత, తన సహోదరులలో పెద్దవాడైన యాకోబుకు ఆయన ప్రత్యేకంగా కనబడినట్టు వ్రాయబడింది.[16] యాకోబు, తానుపొందిన దానిని తన యితర సహోదరులకు: యోసేపు, సీమోను, యూదా అనేవారికి (మత్తయి 13:55) తెలియజేసియుంటాడు. వారందరు యిప్పుడు అపొస్తలులతో కలిసియున్నారు.

బాగా ఎరుకైన లాజరు, నికొదేము, అరిమత్తయి యోసేపు, జక్కయ్య మొదలైనవారు వారిలో చేరినవారైయుండవచ్చు. ఆహా, వారు ఎంతటి ఆకర్షణీయమైన గుంపు! వారు వేచియుండగా ఏమి మాట్లాడుకొంటూ ఉండేవారో, నీవు తెలిసికో గోరవా? దిన దినం ఎంతటి ఉత్సాహంగా ఉంటూ ఉండేదో నీకు తెలియదా?

వారు వేచియున్న దినాల్లో ఏమి జరిగిపోయిందో మనకు అంతా తెలియదు. అయితే ఈ చిన్న గుంపుచేసిన కొన్ని పనులుమాత్రం మనకు తెలుసు. వీటిలో ఒక కార్యం విశేషంగా చెప్పబడింది: వారు ప్రార్థనకు అప్పగించుకొన్నారు (అపొ. 1:14). లూకా 24:53, వారు ''దేవునికి స్తోత్రముచేసిరి'' అని చెప్పుతుంది. శిష్యులు ప్రార్థించినట్టు[17] తొలిసారిగా చదువుతున్నాం. అయితే అది అంత ఎక్కువ కాలం కొనసాగదు. కార్యగ్రంథంలో ప్రతి అధ్యాయం ప్రార్థనతో నింపబడియుంటుంది.

అపొస్తలుల మరియొక పని ఏమంటే - ''ఏక మనస్సుతో'' ఉండడం: వారు ''ఏకమనస్సుతో ఎడతెగక ప్రార్థన చేయుచుండిరి'' (అపొ. 1:14). ''ఏకమనస్సు'' అనే పదం కార్యగ్రంథంలో ఆరుసార్లు కన్పిస్తుంది. వేచియుండడానికి కూడివచ్చిన వారిని ఆలోచించు. ''ఏకమనస్సు'', లేక హృదయపు ఏకత్వం అనుకోకుండనే వారికి వచ్చింది కాదు: ప్రభువైన యేసు సిలువలో మరణించకముందు ఒకరితో నొకరు వివాదమాడుకున్నారు (లూకా 22:24). వారిలో ఎక్కువమంది ఆయనన్ను విడిచిపోయారు; కొందరు ఎరుగనన్నారు. (ఒకరిని మరొకరు వేలుపెట్టి చూపడం ఎంత సులభం!) తన్ను పరిహాసం చేసిన యేసుయొక్క సహోదరులు, ఆయన

అనుచరులతోపాటు ఒకరి ప్రక్కన ఒకరు కూర్చున్నారు, వీరందరు "ఏకమనస్సు" కలిగియుండాలంటే కొంత కన్నీరైనా కారియుండాలి; కొంత గర్వం మింగివేయబడే ఉండాలి. వారు ఏకహృదయాన్ని కలిగియుండాలంటే, పునరుత్థానుడైన ప్రభువుమీద ఏకంగా విశ్వాసముంచి యుండాలి!

మనం "ప్రభువుమీద ఆనుకొన్నప్పుడు" దేవునికి మనకు మధ్యను; మనకు మన సహోదరులకు మధ్యను అంతా సరిగా ఉన్నట్టు చూచుకొనే దానికంటే- మంచిగా మన కాలం గడిపే వీలుండదు!

## బదులు వ్యక్తిని పొందారు (1:15-26)

వారు వేచియున్న దినాల్లో, అపొస్తలులును, తక్కినవారును మరో పని చేయవలసి యుంది. యూదాకు బదులు వారు మరోవ్యక్తిని పొందవలసియుంది. 1:21-22లో - "మనతో కలిసియున్న వీరిలో ఒకడు, మనతోకూడ ఆయన పునరుత్థానమునుగూర్చి సాక్షియై యుండుట అవస్యకమని" పేతురు చెప్పాడు. పెంతెకొస్తు దినానికి సిద్ధపడడంలో ఈ బదులుగా ఉంచడం ప్రాముఖ్యమైన భాగమైయుంది.

ఒక అపొస్తలుడు చనిపోయినప్పుడు అతని స్థలంలో మరొకని ఏర్పరచడానికి యిది నాందికాదు. అలాటప్పుడు ఈ బదులు ఏర్పాటుయొక్క అవసరమేమి? యోహాను సహోదరుడైన యాకోబు చంపివేయబడ్డాడు (అపొ. 12:2), అయితే అతని స్థలంలో మరొకని ఏర్పాటు చేసినట్టు లేదు. కాని యూదా తప్పిపోయి "పోగొట్టుకొనిన యీ పరిచర్యలోను అపొస్తలత్వములోను" పాలుపొందడానికి అతనికి బదులు మరొకడు అవసరం. యూదా చనిపోయినందుకు అతని స్థలంలో మరొకని ఏర్పరచలేదు. కాని అతడు తప్పిపోయి, దాని పోగొట్టుకొనినందున అది జరిగింది (25 వ.).

పరిశుద్ధాత్మ వచ్చేసరికి అపొస్తలుల సంఖ్య తిరిగి పన్నిద్దరైయుండేలా, యూదాకు బదులు మరొకని అతని స్థలంలో నిలపడానికి వారు త్వరపడ్డారు. "పెంతికొస్తు దినానికి అపొస్తలులు పన్నిద్దరై ఉండవలసిన అవసరమేమో?" ఆశ్చర్యంగా ఉంది. మంచిగా ప్రశ్నించాలంటే, "పది, పదిహేను, ఇరవైకి బదులుగా ప్రభువైన యేసు మొదటిగా అసలు పన్నిద్దరినే తన అపొస్తలుగా ఎందుకు ఏర్పరచుకొన్నారో?" ఇశ్రాయేలీయుల పన్నెండు గోత్రాలకు సాటిగా, యేసు తనకు పన్నిద్దరు అపొస్త లులను ఏర్పరచుకొన్నట్టున్నారు. తన పరిచర్య కాలంలో, తన అపొస్తలులకు అనుగ్రహించబడబోయే బహుమానాన్నిగూర్చి యిలా అన్నారు: "(ప్రపంచ) పునర్జననమందు మనుష్యకుమారుడు తన మహిమగల సింహాసనంమీద ఆసీనుడై యుండునప్పుడు నన్ను వెంబడించిన మీరును పంద్రెండు సింహాసనముల మీద

ఆసీనులై ఇశ్రాయేలు పండ్రెండు గోత్రములవారికి తీర్పు తీర్చుదురు" (మత్తయి 19:28). తిరిగి, చివరి రాత్రి భోజనసమయంలో యేసు తన శిష్యులతో యిలా చెప్పారు:

> నా శోధనలో నాతోకూడా నిలిచి యున్న వారు మీరే; గనుక నా తండ్రి నాకు రాజ్యమును నియమించినట్టుగా నా రాజ్యములో నా బల్లయొద్ద అన్న పానములు పుచ్చుకొని, సింహాసనముల మీద కూర్చుండి ఇశ్రాయేలు పండ్రెండు గోత్రములవారికి మీరు తీర్పుతీర్చుటకై, నేనును మీకు రాజ్యమును నియ మించుచున్నాను (లూకా 22:28-30).

ఈ వచనాలు నీవు చూచేటప్పుడు, అపొస్తలులు ఎలా తీర్పు తీర్చారన్న ప్రశ్నలో కూరుకొని పోనవసరంలేదు. (ప్రాథమికంగా, వారు ప్రకటించిన వాక్యంద్వారా, వారు తీర్పు తీర్చారు).[18] పన్నిద్దరు అపొస్తలులు, పన్నెండు సింహాసనాలు, పండ్రెండు గోత్రాలపై పెట్టిన ప్రాముఖ్యతను గుర్తించు. రాజ్యం స్థాపింపబడే సమయం ఆసన్నమయ్యేసరికి, అపొస్తలుల సంఖ్య తిరిగి పన్నిద్దరికి రావలసిన అవసరముంది.[19]

> ఆ కాలమందు ఇంచుమించు నూట ఇరువదిమంది సహోదరులు కూడియుండగా పేతురు వారిమధ్య నిలిచి ఇట్లనెను[20] - సహోదరులారా యేసును పట్టుకొనినవారికి త్రోవచూపిన యూదానుగూర్చి పరిశుద్ధాత్మ దావీదు[21] ద్వారా పూర్వము పలికిన లేఖనము నెరవేరవలసియుండెను. అతడు మనలో ఒకడుగా ఎంచబడినవాడై యీ పరిచర్యలో పాలు పొందెను (1:15-17).

పేతురు తిరిగి నాయకత్వపు స్థానంలో నిలిచియున్నాడు. అతని భయంకరమైన పతనం తరువాత, గలిలయ సముద్ర తీరాన ప్రభువు అతన్ని పునరుద్ధరించారు (యోహాను 21:15-17).

యూదా నిజంగా అపొస్తలుడైయున్నట్టు పేతురు నొక్కిచెప్పాడు: ''అతడు మనలో ఒకడుగా ఎంచబడినవాడై (మన సంఖ్యలో అతడు ఒకడైయుండెను **NIV**), యీ పరిచర్యలో పాలుపొందెను.'' తక్కిన అపొస్తలులందరివలె, యూదాకూడా తన సామర్థ్యాన్నిబట్టి,[22] తగిన హక్కులను బాధ్యతలను పొందినవాడైయున్నాడు. దయ్యాలను వెళ్లగొట్టడానికిని, సకల విధములైన రోగాలను బాగుచేయడానికిని తక్కిన అపొస్తలులు ఎలా ఆజ్ఞపొందారో, అలాగే యూదాకూడా పొందాడు (మత్తయి 10:1). యూదా సమస్య ''ఆదినుండి సాతానువాడైయుండడం కాదు.''[23] అతడు హీనంగా ప్రారంభమై హీనంగానే కొనసాగలేదు. కాని అతడు ఉన్నతంగా ప్రారంభమై కడకు పతనమయ్యాడు. యేసును వెంబడించే ప్రతివానికి యిక్కడ హెచ్చరిక ఉంది! (1 కొరింథీ. 10:13 చూడు).

ఈ సందర్భంలో లేఖనభాగమందు, లూకా పేతురు మాటలను నిలిపి, అన్య జనులైన పాఠకులకొరకు యూదాకు ఏమి సంభవించిందో కొద్ది వివరణను యిచ్చాడు:[24]

> ఈ యూదా ద్రోహమువలన సంపాదించిన (బహుమానము NIV) రూకల నిచ్చి యొక పొలమునుకొనెను. అతడు తలక్రిందులుగా పడి నడిమికి బద్దలైనందున అతని పేగులన్నియు బయటికి వచ్చెను. ఈ సంగతి యెరూషలేములో కాపురమున్న వారికందరికి తెలియవచ్చెను గనుక వారి భాషలో అ పొలము అకెల్దమ అనబడియున్నది; దానికి రక్తభూమి అని అర్థము (18-19 వచ.).

యూదా యొక్క మరణ గాథ మత్తయి 27:3-9లో ఉన్నదానికి, యిక్కడికి కొంత వ్యత్యాసముంది. ఈ వ్యతాసం అసంబద్ధంకాదు.[25] పైగా అవి ఒకదానికొకటి బలపరచుకొంటున్నాయి. ఒకదాని లోటును మరొకటి బర్తీచేస్తున్నాయి, రెండు రచనలను దగ్గరకు చేర్చిచూస్తే, దాగియున్న శక్తిగల యూదా జీవితాంతం ఎలాగ య్యిందో తెలుస్తుంది: యూదా, మనోవ్యాకులతతో ''ఆ వెండి నాణెములను[26] దేవాలయములో పారవేసి, పోయి ఉరిపెట్టుకొనెను.'' తృణీకరింపబడిన అతని దేహాన్ని ఎవరూ పట్టించుకోనట్టున్నారు. తాను ఉరిపోసికొన్న తాడైనా[27] చివరికి తెగిపోయి ఉండాలి; లేదా అతని దేహమైనా మురిగిపోయి ఉండాలి, కుమ్మరివాని పొలమనబడిన[28] రాతి భూమిమీద అది పడిపోయేవరకు! లూకాయొక్క వర్ణనైతే మరీ అసహ్యంగా దాన్ని చిత్రించింది. ప్రభువునకు ద్రోహంచేస్తే, అలా చేసిన వారికేమి జరిగిందో చూపడానికిగాను లూకా అలా కావాలనే చేసినట్టుంది.

20వ వచనంలో తిరిగి మనం పేతురుయొక్క మాటల దగ్గరకు వద్దాం. 16వ వచనంలో పేతురు యిలా అన్నాడు: ''యూదాను గూర్చి పరిశుద్ధాత్మ దావీదుద్వారా పూర్వము పలికిన లేఖనము నెరవేరవలసి యుండెను.'' తన మనస్సులో ఉన్న లేఖన భాగాన్ని పేతురు 20వ వచనంలో తెలియజేశాడు: ''- అతని యిల్లు పాడైపోవునుగాక, దానిలో ఎవడును కాపురముండక పోవునుగాక; అతని యుద్యోగము వేరొకడు తీసికొనునుగాక అని కీర్తనల గ్రంథములో వ్రాయబడియున్నది'' (అతని నాయకత్వపు స్థానము NIV)[29] పేతురు దావీదు మాటలను కీర్తన 69:25; 109:8 ల్లో నుండి కోట్ చేశాడు. రెండు కీర్తనలు కూడా, నాయకత్వంలో ఉన్న దావీదు శత్రువులను గూర్చి తెలుపుతున్నాయి, ఈ మనుష్యులు దావీదు మీదికి తిరుగబడి తన సింహాసనంనుండి అతని కూలద్రోయ ప్రయత్నించినవారే. దానికి మారుగా దేవుడు వారిని తొలగించి, వారి స్థలంలో ఆధారపడదగిన దైవికమైన నాయకులను నిలువ బెట్టాలని దావీదు ప్రార్థించాడు. దావీదు మెస్సీయాకు సాదృశ్యంగా ఉన్నందున, ఈ లేఖన భాగాలు యూదా యేసును అప్పగించడాన్నిగూర్చి, అందునుబట్టి అతని[30] స్థలాన్ని వేరొకడు తీసికోవాలనే దాన్నిగూర్చి సూచించినట్టు పేతురు అన్నాడు.

ఇది పరిశుద్ధాత్మ అపొస్తలుల మీదికి రాకముందు జరిగిన సంఘటన గనుక, యూదాకు బదులు వేరొకడు నియమింప బడాలని గాని, ఈ లేఖనభాగాలు వీటినిగూర్చి మాట్లాడినవనిగాని - పేతురుకు ఎలా తెలుసు? దాఖలు చేయబడని

ప్రత్యేకమైన ప్రత్యక్షత పేతురు పొందియుండవచ్చు. ఒకవేళ ప్రభువైన యేసు పునరుత్థానుడైన తరువాత, ఆయన వారికి తన్నుతాను సజీవునిగా కనుబరచుకొన్న ఆ నలభైదినాల కాలంలో "లేఖనములను గ్రహించునట్లు వారి మనస్సులను తెరిచారు కాబోలు!" (లూకా 24:45). ఏది ఎలాగున్నా, వర్తమానం అందింపబడింది; యూదా బదులు అతని స్థానంలో నిలువబోయేవానికి ఎలాటి యోగ్యతలు ఉండాలోకూడా వర్తమానం అందించబడింది:

> కాబట్టి యోహాను బాప్తిస్మమిచ్చినది మొదలుకొని ప్రభువైన యేసు మనయొద్దనుండి పరమునకు చేర్చుకొనబడిన దినమువరకు, ఆయన మన మధ్య సంచరించుచుండిన కాలమంతయు మనతో కలిసియున్న వీరిలో ఒకడు, మనతోకూడా ఆయన పునరుత్థానమును గూర్చి సాక్షియై యుండుట అవస్యకమని చెప్పెను (21-22 వ.).

పేతురు యొక్క మాటలు మూడు యోగ్యతలను గూర్చి తెలుపుతున్నాయి: (1) యూదా స్థానంలో నియమింపబడేవాడు అపొస్తులులతో కలిసి తిరుగుతున్నవాడై యుండాలి; స్త్రీ[31] అతని స్థానాన్ని ఆక్రమించుకొనకూడదు. (2) ప్రభువైన యేసు యొక్క పరిచర్య దినాల్లో ప్రభువుతోను, ఆయన అపొస్తులులతోను ఎక్కువగా ప్రయాణాలు చేసినవాడైయుండాలి. ప్రభువుతో తిరిగింది ఆ పన్నిద్దరు మాత్రమే కాదు. ఒకసారి ప్రభువు 70 మందిని కూడా సువార్త ప్రచారానికి పంపారు (లూకా 10:1). ఇలాటి యోగ్యత - వారిచ్చే సాక్ష్యము నమ్మదగినదిగా ఉండాలనే ఉద్దేశంతోనే కోరబడి యుండవచ్చు. మృతులలోనుండి లేచింది యేసే, వంచకుడుకాడు. యేసును బాగుగా ఎరిగినవారే, ఆయన పునరుత్థానాన్ని గూర్చి సాక్ష్యమివ్వడానికి బాగా సరిపోతారు. (3) యూదా స్థానంలో నిలువబోయేవాడు - ఆయన పునరుత్థానాన్ని[32] చూచినవాడైయుండాలి. మరోవిధంగా చెప్పాలంటే, ప్రభువు మృతులలోనుండి లేచిన తరువాత ఆయనను చూచినవాడైయుండాలి. పునరుత్థానుడైన ప్రభువును అనేకులు చూచారు (1 కొరింథీ. 15:6).

అయినా, గాని, యిద్దరు మాత్రమే సూచింపబడిన యోగ్యతలు కలిగినవారై యున్నట్టున్నారు: "అప్పుడు వారు యూస్తు[33] అను మారుపేరుగల బర్సబ్బా[34] అనబడిన యోసేపు, మత్తీయ అను ఇద్దరిని నిలువబెట్టిరి" (23 వ.). వీరిద్దరినిగూర్చి లేఖనాల్లో యింతకంటె యింకా ఏమి ఎక్కువగా చెప్పబడలేదు.[35] అయితే వారిద్దరు చాల ప్రత్యేకమైన శిష్యులైయుండి ఉండాలి.

యూదా స్థానానికి ఒకే ఒక్కడు అవసరం గనుక, యిద్దరు ఆ యోగ్యతలుగలవారై ఉన్నందున, నిర్ణయించడాన్ని దేవునిచేతికే వారప్పగించారు.

> (వారు) ఇట్లని ప్రార్థనచేసిరి - అందరి హృదయములను ఎరిగియున్న ప్రభువా, తన చోటికి పోవుటకు యూదా తప్పిపోయి పోగొట్టుకొనిన యీ పరిచర్యలోను అపొస్తల

త్వములోను పాలుపొందుటకు వీరిద్దరిలో నీవు ఏర్పరచుకొనినవానిని కనబరచుమనిరి (24-25 వచ.).

ఈ గ్రంథంలో ప్రార్థనను ఉదహరించింది యిది రెండవసారి, ప్రార్థనయొక్క మాటలను దాఖలుచేసింది యిది మొదటిసారి. ***kardiognosta***, "హృదయముల నెరిగినవాడా" అని దేవుడు సంబోధింపబడ్డారు. "... మనుష్యులు పైరూపమును లక్ష్యపెట్టుదురుగాని యెహోవా హృదయమును లక్ష్యపెట్టును" (1 సమూ. 16:7).

యూదాయొక్క చివరి గమ్యం ఎంత సున్నితంగా నడిపింపబడిందో గమనించు: ''తన చోటికి పోవుటకు యూదా'' తప్పిపోయాడట. ''తన చోటికి పోవడం'' అంటే, తన క్రియలనుబట్టి తానెక్కడికి పోనర్హుడో అక్కడికే పోవడం ''అని అర్థం'' ''తనకు చెందిన స్థలానికే వెళ్లాడని'' **NIV** అంది. యూదా ''బయటికి తొలిగి'' అక్షరార్థంగా తన అపొస్తలత్వపు పరిచర్యనుండి (''పడిపోయినందున'') యూదాయొక్క ''స్వస్థలమేదో''[36] సందేహింపనవసరంలేదు. అంత గొప్ప స్థితిలో నిలువవలసిన వానికి ఎంత దుఃఖకరమైన అంతం!

ఆ యిద్దరిలో పడిపోయిన యూదాయొక్క స్థానంలో నిలువబోయేదెవరు? అప్పటికి పరిశుద్ధాత్మ అపొస్తలులమీదికి దిగియుండలేదు గనుక దేవునియొక్క ఎన్నిక ఏమైయుంటుందో వారికి ఎలా తెలుస్తుంది? తెలిసికొనడానికి ఉపయోగించిన పద్ధతి ఆశ్చర్యంగా ఉంది. ''వీరినిగూర్చి చీట్లు'' వేశారు (26 వ.).[37] వారుపయోగించిన పద్ధతి ఏదో మనకు తెలియదు.[38]

ఉపయోగించిన పద్ధతి ఏదో మనకు సరిగా తెలియకపోయినా, రెండు పాయింట్లను మాత్రం నొక్కి చెప్పాలి: (1) ఓటింగు పద్ధతిలో ఎన్నికచేయడానికి ప్రయత్నించలేదు. దేవుడు మాత్రమే వారి హృదయాలను ఎరుగ గలరుగాని, ఆ పని అపొస్తలులవలన కాదు. (2) ''ఆకస్మిక సంభవానికో'', లేక వారి ''కర్మ''కో వారిని వదలివేయ లేదు. గాని, వారిలో ఒకని ఏర్పరచుకొనే నిర్ణయాన్ని దేవునికే అప్పగించారు.

యూదాకు బదులు మరొకని అతని స్థానంలో కావాలను కొనడమనేది, అపొస్తలులు లేఖనాలను గ్రహించేలా ప్రభువు వారి ''మనస్సులను తెరచి''నందున జరిగియుంటుందని నేను యింతకు మునుపే చెప్పాను (లూకా 24:45). ఆ పద్ధతిని ఉపయోగించేలా ప్రభువే సూచించారో, లేక, అది వారికి ఎరుకైయున్నందున అపొస్తలులే ఆ పద్ధతి ఉపయోగించారో తెలియదు. పాతనిబంధనలో[39] చీట్లు వేయడమనేది సాధారణమైన అలవాటు. యాజకులు ఏ పనులు చేయాలనే దానికి అపొస్తలుల కాలంలో చీట్లువేయడం వాడుకలోనే ఉంది (లూకా 1:9). పాతనిబంధనలో ''చీట్లు ఒడిలో వేయబడును. వాటివలని తీర్పు యెహోవా వశము'' అని చెప్పబడింది(సామె. 16:33).

కార్యగ్రంథం 1లో చీట్లు వేయడమంటే నాకు అంతగా తెలియదుగాని, అయితే నాకు ఒకటి మాత్రం తెలుసు: పరిశుద్ధాత్మ వచ్చిన తరువాత, దేవుని చిత్తమేదో తెలిసికొనడానికి ఈ పద్ధతిని క్రైస్తవులు ఎన్నడూ ఉపయోగించలేదు! ఆది సంఘంలో పెద్దలనుగాని, పరిచారకులనుగాని ఈ పద్ధతి చొప్పున ఏర్పరచుకొనలేదు (అపొ. 6; 1 తిమోతి 3; తీతు 1). సిద్ధాంత సంబంధమైన సమస్యలను ఈ పద్ధతిలో తీర్చుకోలేదు (అపొ. 15:1-31). ఫొటోకు ముందుగా ఎవరు నిలబడతారో, లేదా కేక్‌లో మొదటి ముక్కను ఎవరు అందుకోబోతారో తెలిసికొనడానికిగాను మన బిడ్డలు అచ్చు, బొమ్మలు వేసికొనడంతో నిర్ణయించుకొంటే, అది వేరే విషయంగాని, దేవుని చిత్తాన్ని తెలిసికొనడానికి అది మార్గమే కాదు. దేవుని చిత్తమేదో నిర్ణయించడానికి పరిశుద్ధాత్మ ప్రేరేపణవలన అనుగ్రహింపబడిన వాక్యం నొద్దకు వెళ్లుతాం. దేవుని చిత్తం తెలిసికొనడానికి చీట్లు వేయడమనేది కేవలం తాత్కాలికమైన ఏర్పాటు మాత్రమే. అప్పుడు దేవుడు దానినంగీకరించారు; నేడది కేవలం మూఢనమ్మకం మాత్రమే![40]

వారిద్దరిలో దేవుడు ఏరుకొన్నదెవరిని? "...మత్తీయ పేరట చీటి వచ్చెను గనుక అతడు పదనొకండుమంది అపొస్తలులతో కూడ లెక్కింపబడెను" (26b వ.). తనకు కావలసినవానిని దేవుడు కోరుకున్నారు.[41] మనం ప్రతిసారి అపొస్తలులను గూర్చి చదువుతూ ఉంటాం గాని, మత్తీయ పేరు క్రొత్తనిబంధనలో మరెన్నడు కన్పించదు. పారంపర్యం ప్రకారం, అతడు ఇతియొపీయాకు వెళ్లి అక్కడ హతసాక్షియైనట్లు చెప్పుతారు.[42] అది సత్యమో కాదో గాని, తక్కిన అపొస్తలులవలె మత్తీయ తొలిగా "యెరూషలేములోను, యూదయ, సమరయ దేశములయందంతటను, భూది గంతముల వరకును" అతడు సాక్షియైయున్నట్లు చెప్పుతారు (1:8).

అపొస్తలులలో 12వ సంఖ్యకు వారు వచ్చి చేరుకొన్నారు.[43] సిద్ధపాటు ముగిసింది. అన్ని సిద్ధంగా ఉన్నాయి. పరిశుద్ధాత్మ రాకకు అది సమయం!

## ముగింపు

అపొ. 2లోని గొప్ప సంఘటనలు బయల్పడక మునుపు సిద్ధపాటు ఎలా అవసరమయ్యిందో అలాగే, దేవుడు మనలను వాడుకొనేలా - మనస్సులను, హృదయాలను జీవితాలను సిద్ధపరచు కోవలసియుంటుంది. పాపంలో నశించిన లోకం మన దృష్టిలో ఉండాలి. మన ఆత్మలో నశించిన ఆత్మలను గూర్చిన భారం ఉండాలి. నశించినవారు రక్షింపబడాలనే ఆసక్తి మనలో మండుతూ ఉండాలి. మనం సిద్ధపడింది ముందున్నట్లు ఎంచబడదు; మన సిద్ధపాటుకు ఆలస్యం చేయ తెగించకూడదు.

మన జీవితాలు దేవునితో సరిగా ఉన్నాయో లేదో చూచుకొని, సరిగా ఉండేలా చేసికొనడమే సిద్ధపాటులో అతి ప్రాముఖ్యం. సువార్తకు నీవు విధేయత చూపవలసిన

అవసరం ఉందా? లేక నీవు పునరుత్థరింపబడవలసిన అవసరతలో ఉన్న దేవుని తప్పిపోయిన కుమారుడవా? ఆలస్యం చేయవద్దు. త్వరపడి సరి చేసికో!

---

సూచనలు

[1]యూదులు సబ్బాతు దినాన 2000 మూరల దూరం నడువవచ్చునని వారి ధర్మశాస్త్రోపదేశకులు నిర్ణయించారు. అది దరిదాపు 6, లేక 7 ఫర్లాంగుల దూరం ఉండవచ్చు. ప్రభువైన యేసు ఆరోహణం బేతనియకు సమీపాన జరిగింది (లూకా 24:50). ఇది ఒలీవకొండకు తూర్పుదిశగా ఉంటుంది. బేతనియ యెరూషలేమునకు సబ్బాతు దినాన నడువదగిన దానికంటె ఎక్కువ దూరం. అపొ. 1:12లో ఒలీవకొండ యెరూషలేమునకు దగ్గర, సబ్బాతుదినాన నడవదగినంత దూరం. గనుక యెరూషలేముకు రావాలంటే ఎక్కువ దూరం ప్రయాణం చేయవలసిన అవసరం లేదు. [2]1947 ఆగష్టు 15వ తేదీని బ్రిటిష్ ప్రభుత్వంనుండి మనదేశానికి స్వతంత్రం ప్రకటింపబడింది. [3]జెలోతే అనేవారు రోమా ప్రభుత్వాన్ని కూలద్రోయాలని తయారైన ఒక రాజకీయ పార్టీ. ఒకప్పుడు రోమా ప్రభుత్వానికి సుంకం వసూలుచేసే మత్తయి; ప్రభుత్వానికి ఒకప్పుడు వ్యతిరేకియైయున్న సీమోను తిరిగి ఏకమై పనిచేయగలుగుతున్నారంటే, వారిని ఏకంచేసిన ప్రభువుయొక్క శక్తి వారిమధ్య ప్రదర్శింపబడుతుంది. [4]తక్కిన పట్టీలు, మత్తయి 10; మార్కు 3; లూకా 6ల్లో చూడవచ్చు. [5]లూకా 24:53 వెలుగులో "నివసించడం" అంటే, తమ సామానులు పెట్టుకొని, భోజనం వగైరాలు అక్కడే చేస్తూ ఉండవచ్చు. పగటిపూట వారు దేవాలయంలో ఉన్నట్టు సూచింపబడింది. 1:14లో చెప్పబడ్డ 120 మంది కూడా ఆ మేడగదిలోనే ఉన్నట్టు ఊహించబడుతుంది గాని, లేఖనభాగం అలా అనడంలేదు 1:15. అపొస్తలులు ఎడతెగక దేవాలయంలో ఉంటున్న కారణాన, ప్రార్థనలు అక్కడ చేసుకొంటూ ఉండవచ్చు. [6]మార్కు తల్లియొక్క గృహంలో వారు కూడియున్నట్టు కొందరు ఊహిస్తారు (12:12). [7]వారు ముఖాలు చిన్నబోయినట్టుగా లేరు. [8]మూడు **సంవత్సరాల** క్రిందట, దేవుని రాజ్యం సమీపంగా ఉందని యేసు ప్రకటించారు గాని అప్పటికి యింకా రాలేదు. [9]ప్రభువైన యేసు ఒక్కసారే 500 కంటే ఎక్కువమంది సహోదరులకు కనబడిన కారణాన (1 కొరింథీ. 15:6), 120 మంది అని సూచించడంలో - ప్రభువు శిష్యులందరు యిక్కడ ఉన్నట్టు కన్పించరు. తక్కిన వారు గలిలయలో ఉండియుండవచ్చు. [10]లూకా 10:38.

[11]1 కొరింథీ. 9:5. [12]మత్తయి 27:55-56; లూకా 8:2-3. [13]మార్కు 15:40; యోహాను 19:25. [14]లూకా 23:55; 24:10. [15]పారంపర్యం ప్రకారం- తరువాత కాలంలో మరియ యోహానుతోకూడా ఎఫెస్సునకు వెళ్లి, అక్కడే చనిపోయినట్టు చెప్పబడింది. [16]1 కొరింథీ. 15:7. ప్రభువైన యేసుకు, యాకోబుకు తల్లి ఒక్కతైయున్నా, యేసుకు తండ్రి దేవుడు; యాకోబుకు తండ్రి యోసేపు. [17]తమకు ప్రార్థనను నేర్పుమని శిష్యులు ప్రభువును అడిగారు (లూకా 11:1), గనుక వారు ప్రార్థించినట్టు మనం అనుకోవాలి. ప్రభువైన యేసుయొక్క పరిచర్య కాలంలో వారు ప్రార్థించినట్టు రికార్డులేదు. వారిని ప్రార్థించుమని యేసు కోరినప్పుడు వారు నిద్రపోయారు (మార్కు 14:38-40). [18]తన్ను నిరాకరించేవారు తన వాక్యంద్వారా తీర్పుతీర్చబడతారని యేసు నొక్కి చెప్పారు (యోహాను 12:48). [19]సంఘ - రాజ్యం ఒకసారి స్థాపింపబడిన తరువాత, అపొస్తలులు చనిపోతే, ఒకవిధంగా, వారు తమ సింహాసనాలమీద కూర్చుండి, ప్రభువుతోకూడా ఏలనారంభిస్తారు. ప్రభువును నిరాకరించిన ఇశ్రాయేలు పండ్రెండు గోత్రములవారికి వారు తీర్పుతీర్చుతారు. వారిని తొలగించి వేరేవారిని కూర్చోబెట్టనవసరంలేదు. [20]సహోదరులు అనే పదం రెండు సార్లు ఉపయోగించబడింది. తొలిగా 15వ వచనంలో, రెండవసారి 16వ వచనంలో. ఈ గ్రంథంలో యిక్కడే తొలిసారిగా ఆ పదం ఉపయోగించబడింది.

[21]లేఖనములు దైవప్రేరేపితములనే దానికి యిది బలమైన లేఖన భాగమైయుంది. [22]యేసును అప్పగించడానికే యూదా ఎన్నిక చేయబడినట్టు కొందరన్నారు. యేసును ఎరుగననే దానికే పేతురు ఎంచుకోబడ్డాడా? తమలో ఎవరు గొప్పవారో అని తగవులు పడడానికే తక్కిన అపొస్తలులు కోరుకోబడ్డారా? వారేమైయున్నారో అనే దాన్నిబట్టిగాక, వారు ఎలా తయారవ్వగలరో అనే దృష్టితోనే ఏర్పరచుకోబడ్డారు. వారి బలహీనతలు యేసుకు తెలుసు, అయితే వారు ఎలా తయారుకాగలరోకూడా; అంటే వారిలో దాగియున్న సామర్థ్యాన్నికూడా ఆయన ఎరుగు. తక్కిన వారి విషయంలో యిది ఎంత సత్యమో, యూదా విషయంలోకూడా అది అంతే సత్యం (1:11). యూదా యూదయనుండి వచ్చినవాడు గనుక, గలిలయులకంటె కొంచెం ఎక్కువగా చదువుకున్నవాడై యుండవచ్చు. ప్రభువైన యేసుకును ఆయన శిష్యులకును ఉన్న డబ్బు అతని యొద్ద ఆయన ఉంచారంటే, యూదాపై తనకెట్టి గౌరవముందో కన్పిస్తుంది (యోహాను 12:6; 13:29). [23]"మొదటినుండి సాతానై యున్నాడు" అనే పదజాలం, కృపనుండి పడిపోరు అనేవారు

ఉపయోగించేది యూదాను సాతానని ఒకసారి ప్రభువు సూచించారు (యోహాను 6:70-71), అయితే పేతురుకూడా సాతాననే చెప్పబడ్డాడు (మార్కు 8:33). ఈ రెండింటికి అర్థమేమంటే- వారిద్దరు సాతానుచే ఉపయోగింపబడిన సాధానాలయ్యారని! యేసును అప్పగించడానికి సాతాను అతని మనస్సులో ఆలోచన కలిగించాడు. సాతాను వానిలో ప్రవేశించాడు (యోహాను 13:2, 27). అయితే యూదా, "మొదటినుండి సాతానని" చెప్పబడలేదు. [24]ఈ అంతరాయాన్ని ఎక్కువమంది నవీన తర్జుమాదారులు 18-19 వచనాలను బ్రాకెట్లలో పెట్టారు. అయితే **KJV**లో బ్రాకెట్లులేవు. ఈ మాటల తీరును చూస్తుంటే, వీటిని మాట్లాడేది పేతురుకానట్టు తేటగా కన్పిస్తుంది. యూదాకు ఏమి సంభ వించిందో - పేతురు తన శ్రోతలకు వివరించనవసరంలేదు. "అరామి" అనేది "వారి" భాషగా పేతురు చూపనవసరం ఉండేదేకాదు. తన శ్రోతలకు "అకెల్దమ" - అనే మాటకు అర్థం చెప్పనవసరం పేతురుకు ఉండేదేకాదు. [25]బైబిలు దేవుని గ్రంథమని నమ్మనివారు తరచుగా ఈ రెండు లేఖనాలను చూపి, బైబిల్లో అసంబద్ధముందని చూపప్రయత్నిస్తారు. అసలు వాస్తవమేమంటే - ఒకరు యివ్వని వివరణలు మరొకరిచ్చారు. ఉదాహరణకు, మత్తయి 27:8లో యాజకులు ఆ పొలాన్ని కొన్నట్టుంది. కార్యగ్రంథంలో, యూదా ఆ పొలాన్ని కొన్నట్టుంది. రెండు లేఖనాలను ఒక చోటకు చేర్చితే మనకున్న సమాచారమిది: "రక్తభూమి" అని ఆ పొలం పిలువబడడానికి రెండు కారణాలున్నాయి. మత్తయి ఒక కారణం చెప్పాడు, లూకా మరోదాన్ని చెప్పాడు. [26]అది యేసును అప్పగించడానికి వారిచ్చిన డబ్బు (మత్తయి 26:15). [27]యూదా ఉరిపోసికొనడానికి తాడుగాని మరేదైనా ఒకటి ఉపయోగించి యుండవచ్చు. [28]కుండలు చేసేవాడు తన పొలంలో మట్టంతటిని తన పనిలో ఉపయోగిస్తాడు గనుక చివరకు ఆ పొలం దేనికీ పనికిరాకుండా పోతుంది. ''కుమ్మరివాని పొలము'' అనేది మత్తయి 27:7నుంచి వచ్చింది. [29]**KJV**లో అతని బిషప్రిక్ అనే పదం వినియోగించబడింది. ఇది గ్రీకుకు అక్షరార్థమైన తర్జుమా. **episkopos** లో **"overseer"** అక్షరార్థంగా, "అతనియొక్క పైవిచారణ" **(his oversight)** పని. [30]కొన్ని ప్రవచనాలు జరుగబోయే సంభవాలనుగూర్చి (2:16) తెలిపాయి. మరికొన్ని ప్రవచనాలు సాదృశ్యంగాను, చాయగాను సూచింపబడ్డాయి (హెబ్రీ. 8:5; 10:1). అయితే ప్రవచనమేదో ప్రవచనంకానిదేదో వ్యాఖ్యానించే హక్కు మనకు లేదని గుర్తుంచుకోవాలి. అలాగే ప్రవచనపు నెరవేర్పును గూర్చికూడా అయితే, "పరిశుద్ధాత్మ తన్నుగూర్చి తాను ఎలాగైన వాఖ్యానించు కోవచ్చు" (Anthony Lee Ash, *The Acts of the Apostles,* Part 1, The Living Word Commentary, ed. Everett Ferguson [Austin, Tex.: Sweet Publishing Co., 1979], 34).

[31]లేఖన భాగంలో **"Anthropos"** అనే సామాన్యమైన పదాన్ని వాడలేదు. ఆదిభాషలో 1:21 **Aner** అనే పదం వాడబడింది. దాని అర్థం స్త్రీకాదు; పురుషుడనే. [32]ప్రభువుయొక్క పునరుత్థాన్ని చూచినవాడైయుండాలి అన్నప్పుడు, అపొస్తలునికి "వారసుడైయుండే" అవకాశమేలేదు. పైగా, నేడు ఈ యోగ్యతలు ఎవనికీ ఉండే వీలులేదు! [33]"బర్సబా" అంటే అక్షరార్థంగా "సబ కుమారుడు" ఒకవేళ ఆ పేరుకు అర్థం - "సబ్బాతు కుమారుడు" అయ్యుండవచ్చు. ఒకవేళ అతడు సబ్బాతు దినానే పుట్టియుండవచ్చు. సబ్బాతు దినాన పుడితే, అతనికి అది తమాషా పేరుగా ఉండియుండవచ్చు. [34]యోసేపు అనేది అతని హెబ్రీ నామం. దానికి గ్రీకురూపం **"Justus"** ఒకటికంటె ఎక్కువ పేర్లు ఉండడం వారికి సహజమే. [35]యూస్తు అను మారుపేరుగల బర్సబాను గూర్చి చాలా పారంపర్యాలున్నాయి. పాము విషం త్రాగినా అతనికి హాని జరుగలేదనీ; నీరో అతని చెరసాలలోపెట్టి విడుదలచేశాడని చెప్పబడిందిగాని వీటికి లేఖనాధారాలు లేవు. ఇతడు అపొస్తలుడుగా ఎన్నిక చేయబడకపోయినా, కోపగించుకొన్నవాడో, విడిపోయిన వాడో కాడు. ఈ పాఠం మనం నేర్చుకోవాలి. [36]ప్రభువైన యేసు మాటలే అతని గతి ఏమైయుంటుందో సూచిస్తున్నాయి. మత్తయి 26:24; యోహాను 17:12లను చూడు. [37]**KJV**లో - "వారు తమ చీట్లను వేసిరి" అని ఉంది. వారు చీట్లను ఉపయోగించారని ఉంది (**NCB**). [38]ఈ పద్ధతినిగూర్చి పెద్ద రాదాంతం చేయపనిలేదు.[39]లేవీయ .16:8; సంఖ్యా 26:56; యెహోషువ 7లో ఈ పద్ధతి ఉపయోగించిన సందర్భం ఒకటి చెప్పబడింది. ప్రధానయాజకుడు ఊరీము, తుమ్మీలను ఉపయోగించే పద్ధతిని కూడా కొందరు దీనిలో కలుపుతారు. [40]దేవుని వాక్యంలో కన్పించని నిర్ణయాలను మనం చేయవలసివచ్చినప్పుడు సహితం, ఆయన అంగీకరించే వాటిని నేర్చుకోగలగడానికి మార్గాలున్నాయి (1 కొరింథీ. 1:6-9) అనుభవంగల పరిశుద్ధులతో మాట్లాడవచ్చు, "తెరువబడిన ద్వారాల కొరకు కనిపెట్టుతూ," ప్రధానమైన నిర్ణయాలను **chance**కు వదలివేయవచ్చు. [41]వింతైన సంగతి ఏమంటే, మత్తీయను ఏర్పరచుకొనడంలో అపొస్తలులు పొరపాటు చేశారని కొందరంటున్నారు. పౌలును దేవుడు పండ్రెండవ అపొస్తలుడు ఉండాలని కోరుకొన్నాడని వారంటారు. అయితే పేతురు సూచించిన యోగ్యతలు పౌలుకులేవు. పౌలు అపొస్తలుడే అయినప్పటికి, అతడు ప్రత్యేకంగా అన్యజనులకు అపొస్తలుడు. మత్తీయ ఆ పదనొకండుగురితో ఒకడుగా ఎంచబడ్డాడు. [42]మరో పారంపర్యం ప్రకారం లూకా 10:1లో పంపబడిన 70 మందిలో ఈ మత్తీయ ఒకడని అంటారు. [43]తిరిగి అపొస్తలులు పన్నిద్దరుగా లెక్కించబడ్డారు (అపొ. 6:2).